క్లుప్తంగా

బాలికల హాస్టల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

నల్లగొండ: పట్టణంలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహం (ఎఫ్,ఇ)లో 2024–2025 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని హాస్టల్ వార్డెన్ కమల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ కళాశాలలు, ఇతర కోర్సుల్లో విద్యాభ్యాసం చేసే బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హాస్టల్‌లో ఉచిత వసతి నాణ్యమైన భోజనం అందించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థినులు https/bchostels.cgg.in.ts వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9866314157 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

నార్కట్‌పల్లి : పిల్లలు, పెద్దలు ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్కనైనా నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని క్లీన్‌హోం గ్రీన్‌హోం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు అన్నారు. మండలంలోని కొత్తగూడెం గ్రామ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్ భానుప్రకాష్, తడకమల్ల వేణుగోపాల్‌రావు, గుత్తా మౌనిక నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిట్యాల: ఫోర్ వీలర్ టాక్సీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం చిట్యాల పట్టణంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా రుద్రవరం లింగస్వామి, ఉపాధ్యక్షులుగా అమరోజు వెంకన్న, దగ్గుల సైదులు, ప్రధాన కార్యదర్శులుగా జిట్ట వెంకన్న, బైరు విఠల్, కోశాధికారులుగా కర్రే లింగస్వామి, బలికి నిరంజన్‌లు ఎన్నికయ్యారు.

దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టూటౌన్: నీట్ పేపర్ లీక్ అయిందని ఆరోపిస్తూ గురువారం బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో నల్లగొండలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బొమ్మరబోయిన నాగార్జున, కట్ట శ్రీను, నోముల క్రాంతియాదవ్, మిరియాల సైదులు, నరేష్, వెంకట్, రాంబాబు, లింగస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న గీత

చండూరు : చండూరు మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవికి ఎంపీపీ అవ్వారు గీత (గట్టుప్పల్ ఎంపీటీసీ) రాజీనామా చేశారు. గురువారం రాజీనామా లేఖను జెడ్పీ సీఈఓకు ఆమె అందజేశారు. గీత ఇటీవల ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు.

ఎంపీపీకి ఘన సన్మానం

చండూరు(గట్టుప్పల్) : నూతనంగా ఎన్నికైన చండూరు ఎంపీపీ అవ్వారి గీతశ్రీనివాసులును గట్టుప్పల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాములు, పంచాయతీ కార్యదర్శి షఫీ, ఏఎన్‌ఎంలు ప్రేమలత, కవిత, ముబీనా ఉన్నారు

వాహనాల తనిఖీలు

చిట్యాల: పట్టణంలో జాతీయ రహదారిపై పోలీసులు గురువారం ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా నార్కట్‌పల్లి సీఐ నాగరాజు మాట్లాడుతూ వాహనాల ధృవీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనాలకు నంబర్ ప్లేట్స్ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించకుండా నంబర్ ప్లేట్స్ లేని ఇరవైకి పైగా ద్విచక్ర వాహనాలకు జరిమానా విధించారు. ఎస్‌ఐలు సైదా బాబు, లింగయ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలో పోలీసులు నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై నిఘా పెట్టి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ కె.రంగారెడ్డి మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని ఐదు వాహనాలను గుర్తించామని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది సైదులు, సత్యనారాయణ, యాదగిరి, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో బైక్‌చోరీ

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణ రైల్వే స్టేషన్లో బుధవారం రాత్రి ఒక బైక్ చోరీకి గురి కాగా.. మరో రెండు బైక్‌లు చోరీ చేయడానికి విఫల యత్నం జరిగింది. ఒక యాక్టివా, మరో డిస్కవరీ వాహనాలను చోరీ చేసి స్టేషన్ సమీపంలో చెట్ల పొదల చాటున దొంగలు పార్కు చేశారు. అవి స్టార్టు కాకపోవడంతో అక్కడే వదిలేసి పోయారు. ఒక పల్సర్ బైక్‌ను దొంగిలించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

నల్లగొండ క్రైం: ముశంపల్లి రోడ్డులో రాత్రి ఇంటికి వెళుతున్న భార్యభర్తల బైక్‌ను అనుసరించిన గుర్తు తెలియని దుండగులు.. ఏఆర్‌నగర్ దాటిన తర్వాత మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసును అకస్మాత్తుగా లాగారు. దీంతో ఆమె కింద పడిపోగా ఆమె భర్త దుండగులకు వెంబడించడంతో కొద్ది దూరంలో చైన్ వదిలేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపారు.

ప్రమాదం పొంచి ఉన్నా పట్టింపేది !

- కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలు
- విద్యుదాఘాతంతో పశువులు మృతి
- విన్నవించినా పట్టించుకోని విద్యుత్ అధికారులు

శాలిగౌరారం: విద్యుత్ లూజ్ లైన్లతో మండలంలోని ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విద్యుత్ లైన్ల వల్ల పశువులు మృత్యువాత పడుతున్నాయి. ప్రజలు ప్రాణభయంతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రాణాలు తీసే యమపాశాలుగా మారాయంటూ రైతులు వాపోతున్నారు.

కూలేందుకు సిద్ధంగా స్తంభాలు

శాలిగౌరారం మండలంలోని అంబారిపేట, తుడిమిడి గ్రామాల శివారులో ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్–58 నంబర్‌గల 100 హెచ్‌పీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఆయా గ్రామాలకు చెందిన 20 విద్యుత్ వ్యవసాయ మోటార్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ లైన్ల వల్ల రైతులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి తృటిలో ప్రాణాపాయ స్థితి నుంచి రైతులు బయటపడిన సంఘటనలు కొన్ని ఉండగా.. మేతకోసం వెళ్లిన పశువులు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడిన సంఘటనలు అనేకంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ స్తంభాలు చువ్వలు తేలి ఏ క్షణమైనా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి.



అంబారిపేట, తుడిమిడి శివారులో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూపుతున్న రైతులు



చువ్వలు తేలి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

మండలంలో 1846 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

మండలంలో ఒక 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌తోపాటు ఐదు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో మొత్తం 1860 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. వాటిలో సింగిల్ ఫేజ్ 665, త్రీ ఫేజ్ 1195 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లోనూ కిందకు వేలాడుతున్న విద్యుత్ లైన్ల సమస్యతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో పంటల సాగు ఉండకపోవడంతో విద్యుత్ లైన్లను సరిచేసేందుకు అవకాశం ఉంటుంది. అదేవిధంగా శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయవచ్చు. కానీ సంవత్సర కాలంగా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

పొలం పనులు చేసుకోలేకపోతున్నాం



ఎస్‌ఎస్–58 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో నాకు వ్యవసాయ బావి వుంది. నా బావి వద్దకు వచ్చే విద్యుత్ లైను కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారింది. దీంతో పొలంలో పనులు చేసుకోలేకపోతున్నాం. విద్యుత్ లైన్ సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూసి ప్రాణాలను కాపాడాలి.

–నలమాద లింగయ్య, రైతు, తుడిమిడి

రైతులు తీవ్రంగా నష్టపోయారు



అంబారిపేట శివారులో ఉన్న ఎస్‌ఎస్–58 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో పశుపోషకులు, పశువులు మృతిచెందడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విద్యుత్ తీగలను సరిచేయాలి.

–నూనె నరేశ్, రైతు, అంబారిపేట

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మర్రిగూడ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారుల చొరవ చూపాలని ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగిసినందున గ్రామాల్లో ప్రత్యేక అధికారులే పూర్తి బాధ్యతగా వ్యవహరించి సమస్యలకు తావు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ చినమునయ్య మాట్లాడుతూ ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నామని, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ యాకుబ్, సూపరింటెండెంట్ యాకుబ్, ఎంపీఓ రవికుమార్, ఏఓ హేమలత, ఏఈలు వెంకటేశ్వర్లు, రాజేష్, యశ్వంత్, రాఘవేందర్, ఎంఈఓ గురువారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మిరియాల పద్మ, ముమ్మడి యశోద, ఏపీఓ వెంకటేశం, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్, వసతి గృహాల వార్డెన్లు శ్రీను, లింగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాజమణి

సాక్షి కథనంపై చర్చ

ఈ నెల 18న సాక్షి దినపత్రికలో వెలువడిన ×పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం×కథనంపై సర్వసభ్య సమావేశంలో చర్చ జరిగింది. దామెరబీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు మాట్లాడుతూ ట్రాక్టర్ మరమ్మతులు ఎందుకు చేపట్టలేదని, చెత్త ఎప్పటికప్పుడు తరలించకపోతే ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. స్పందించిన ఎంపీఓ ట్రాక్టర్‌కు రెండు రోజుల్లో మరమ్మతులు చేపడతామని బదులిచ్చారు. జింకలకు అటవీ ప్రాంతం కరువైనందున పత్తి మొలకలను తింటున్నాయని, వాటికి ప్రత్యేకమైన కంచెలను ఏర్పాటు చేయడానికి అధికారులు చొరవ చూపాలని ప్రజాప్రతినిధులు కోరారు.

నోట్‌బుక్స్ అందజేత



నోట్‌బుక్స్ అందజేస్తున్న పిల్లి రామరాజు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 8వ వార్డు అక్కలాయిగూడెం ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఆర్‌కేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కోకన్వీనర్ పిల్లి రామరాజుయాదవ్ పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, బ్యాగ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి, ఉపాధ్యాయురాలు మంజుల, మేకల రవి, తంగెళ్ల రవీందర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, నగేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రాల్లో సోమవారం ప్రజావాణి

చిట్యాల: మండల పరిషత్ కార్యాలయంలో ఇకపై ప్రతి సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు చిట్యాల మండల ప్రత్యేకాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. చిట్యాల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలు ఇచ్చిన వివిధ రకాల సమస్యలకు సంబంధించిన అర్జీలను ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించాలని సూచించారు. స్వీకరించిన అర్జీలపై పదిహేను రోజుల్లో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ జయలక్ష్మీ, తహసీల్దార్ కృష్ణ, మున్సిపల్ కమిషనర్ వీరేందర్, మండల వ్యవసాయ అధికారి గిరిబాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరించేందుకు మండలస్థాయి అధికారులు హాజరుకావాలని మండల ప్రత్యేక అధికారి రమేష్ కోరారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ సుధాకర్, ఎంఈఓ కూకుట్ల నర్సింహ, ఏఓ గిరిప్రసాద్, ఏఈలు చంద్రశేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రమేష్

శాలిగౌరారం: మండలంలో ఈ నెల 24 నుంచి ప్రతి సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వ శాఖల అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి, నకిరేకల్ ఏడీఏ రామారావు అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం జరిగిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ లక్ష్మయ్య, డిప్యూటీ తహసీల్దార్ ఎంఏ సత్తార్, ఇన్‌చార్జ్ ఎంఈఓ నాగయ్య, ఏఓ సౌమ్యశృతి, ఎంపీఓ పద్మ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న గోలి మధుసూదన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : గత ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా ఎలాంటి షరతుల్లేకుండా రైతుందరికీ వడ్డీతో సహా రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా ఎకరానికి రూ.7500, ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 13 రకాల వ్యవసాయ ఉత్పత్తులపై కనీస మద్దతు ధర పెంచిందన్నారు. యూపీఏ హయాంలో మూతబడిన ఎరువుల కంపెనీలను తిరిగి ప్రారంభించి రైతులకు ఎరువుల కొరత లేకుండా చేశారని తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ.17 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. వరికి మద్దతు ధర రూ.2320, పత్తికి రూ.7521 పెంచినట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దాసోజు యాదగిరాచారి, బీపంగి జగ్జీవన్, గుండా నవీన్‌రెడ్డి, మంగిలిపల్లి మహేష్, పగిడి మహేష్, ప్రసాద్‌రాథోడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణ



విచారణ చేస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్‌కుమార్

మర్రిగూడ : మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది ఒకరిపై ఒకరు ఎంపీడీఓకు చేసుకున్న ఫిర్యాదులను ఆయన డీఆర్‌డీఓకు పంపారు. దీంతో డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు గురువారం అడిషనల్ డీఆర్‌డీఓ నవీన్‌కుమార్ మర్రిగూడ మండలంలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఏపీఓతోపాటు ఎంపీడీఓను విచారించారు. విచారణ నివేదికను డీఆర్‌డీఓకు అందజేస్తామని నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఏపీడీ ఎం.బాలకృష్ణ, ఎంపీడీఓ జి.చినమునయ్య, ఏపీఓ జి.వెంకటేశం పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

మర్రిగూడ : స్వావలంబి భారత అభియాన్ ఆధ్వర్యంలో ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించే స్వదేశి జాగరణ్ మంచ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నల్లగొండ విభాగ్ కన్వీనర్ పగడాల నగేష్, కో కన్వీనర్ కర్నాటి శ్రీహరి కోరారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం మండల కేంద్రంలో వారు విడుదల చేసి మాట్లాడారు. ఈ సభలో 2030 నాటికి భారతదేశపు ఆర్థిక ప్రణాళికలు, గమ్యాలు నిర్దేశించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వినోద్, దశరథ, అభి, దిలీప్‌రెడ్డి, విజయ్, పరమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు తగవు

నకిరేకల్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల సుకన్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు అన్నారు. నకిరేకల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకపోవడంతో ప్రజలు ఆ పార్టీని ఇంటికి పంపించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, గ్యాస్ రాయితీ, 200 యూనిట్ల లోపు విద్యుత్ ఉచితంగా అందిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, నకిరేకంటి నరేందర్, యాసారం లక్ష్మీ వెంకన్న, రజిత శ్రీను, పద్మ, రమేష్, మునీందర్‌రావు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం

కట్టంగూర్ : వర్షాలు కురవాలని కోరుతూ మండలంలోని మునుకుంట్ల జీపీ పరిధి కుమ్మరిగూడెం మహిళలు గురువారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. మహిళలు నీళ్ల బిందెలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి, రామాలయం వద్ద నీటితో అభిషేకాలు, చుట్టుకాముడు వేసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మల్లమ్మ, లక్ష్మి, పిచ్చమ్మ, సాలమ్మ, సరిత, సత్తమ్మ, సుమిత్ర, శైలజ, పద్మ, లింగమ్మ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

నకిరేకల్ : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో గురువారం చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలను పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోదాటి రాములు, కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, గడ్డం స్వామి, యాసారం లక్ష్మీవెంకన్న, చౌగోని రజిత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా చిట్యాల, వెలిమినేడు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఉరుమడ్ల, వెలిమినేడులో ఎంపీపీ కొలను సునిత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిట్యాల పీహెచ్‌సీ పరిధిలో 5767 మంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందజేసినట్లు వైద్యాధికారి సయ్యద్ అజహర్ అహ్మద్ తెలిపారు. వైద్యాధికారులు సత్య ప్రకాష్, నర్సింహ, సీహెచ్‌ఓ శ్రీనివాసచక్రవర్తి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు పెద్దబోయిన సత్తయ్య, ఎంపీటీసీలు దేశబోయిన స్వరూప నర్సింహ, దుబ్బ పద్మ కుమారస్వామి, కౌన్సిలర్ బెల్లి సత్తయ్య, కోనేటి కృష్ణ, హెచ్‌ఎంలు వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేతేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1–19 ఏళ్ల వయసున్న బాల బాలికలందరికీ నులి పురుగుల నివారణ మాత్రలు వేసేలా ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సిరెడ్డి, మండల వైద్యాధికారి అర్చన, సీహెచ్‌వో సుందర్‌నాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు జగదీష్‌రెడ్డి, కమల, ఆరోగ్య కార్యకర్త జానకి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చేపట్టిన నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రారంభించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్వేత, ఆశావర్కర్లు, హెచ్‌ఎం అంబటి అంజయ్య పాల్గొన్నారు.



చిట్యాల : విద్యార్థికి మాత్ర వేస్తున్న మున్సిపల్ చైర్మన్ చినవెంకట్‌రెడ్డి



కేతేపల్లి : విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న ఎంపీపీ శేఖర్

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ కర్నాటి స్వామి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మాధురి, డాక్టర్ నర్మద, హెచ్‌ఎం సుంకరి భిక్షపతి, ఏఎన్‌ఎంలు ధనమ్మ, పాఠశాల చైర్మన్ శారద, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మర్రిగూడ : జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంతోపాటు దామెరబీమనపల్లిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ, దామెరబీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు, ఉపాధ్యాయులు దీవంత, జంగయ్య, వేణు, శ్రీను, బస్టిన్, వినీల, ఏఎన్‌ఎం మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మీ, మరియమ్మ, ఆశా కార్యకర్తలు విజయ, భాగ్యమ్మ, మంజుల, సైదమ్మ, పాల్గొన్నారు.

శాలిగౌరారంలో..

శాలిగౌరారం: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి సూర్యశిల్ప, ఎంపీటీసీ జోగు సైదమ్మ, పీహెచ్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.



మునుగోడు : విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న వైద్యాధికారి



కట్టంగూర్ : విద్యార్థినికి మాత్ర వేస్తున్న ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య

యోగాతో మానసిక ప్రశాంతత




నల్లగొండ టూటౌన్: యోగా ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



చిట్యాల: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

చిట్యాల: యోగా, మెడిటేషన్‌తో మానసిక ప్రశాంతత నెలకొంటుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ జిల్లా కోఆర్డినేటర్ పల్లపు బుద్ధుడు అన్నారు. ఉరుమడ్ల గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యోగా, మెడిటేషన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించడంతోపాటు మెడిటేషన్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వామి, కృష్ణమూర్తి, నాగయ్య, కృష్ణ, జహీసాబేగం, నాయకులు యాదగిరి, సైదులు, శ్రీను, లింగయ్య పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నల్లగొండ బీజేపీ కార్యాలయంలో గురువారం వికాస తరంగిణి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. 20 సంవత్సరాల లోపు పోటీల్లో ప్రథమ బహుమతి అభిలాష, ద్వితీయ బహుమతి మౌనిక, తృతీయ బహుమతి వైష్ణవి గెలుపొందారు. 20 నుంచి 35 సంవత్సరాల లోపు ప్రథమ బహుమతి కోమలి, ద్వితీయ బహుమతి మనిషా, తృతీయ బహుమతి మహేశ్వరి గెలిచారు. (35 సంవత్సరాలు పైబడిన)లో ప్రథమ బహుమతి ప్రభాకర్‌రెడ్డి, ద్వితీయ బహుమతి దార వెంకట్, తృతీయ బహుమతి విజయలు గెలుపొందారు. చీఫ్ కోఆర్డినేటర్ ఎస్ ఈశ్వర్‌రెడ్డి, వి.రాజేశ్వర్, శిరీష్‌కుమార్, నన్నూరి రాంరెడ్డి, యోగా గురువులు రాపోలు వెంకటేశ్వర్లు, శివ, నాగార్జున, శ్రీకాంత్, సురేష్‌గుప్తా, సింగం ప్రవీణ్, భారతమ్మ, సుజాత, సంధ్యారాణి, శ్రీదేవి, విజయ, సంధ్య, రాజేశ్వరి పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్: బహుమతులు అందుకున్న యోగా సాధకులు

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

కట్టంగూర్ : ఇంటింటికీ మంచినీటి సరఫరా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మిషన్ భగీరథపై గురువారం మండల కేంద్రంలోని 4వ వార్డులో జీపీ అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఇంటిని సర్వే చేసి ఇంటి యజమాని ఫొటోతో సహా పూర్తి వివరాలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్, సిబ్బంది జానకిరాములు, కాపుగంటి శ్రీను, బాలచందర్, నర్సింగు శ్రీను పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ రూ. 7 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులకు వసతులు కల్పించాలని, ఉన్నతాధికారులు తనిఖీలు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఫీజు నియంత్రణ చట్టం తేవాలని, విద్యా హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జయందర్, మణి, శివ, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత

చండూరు : రేషన్ డీలర్లు షాపులను సమయానికి తెరిచి వినియోగదారులకు అందుబాటులో ఉంటూ నిత్యావసర సరుకులు సక్రమంగా అందజేయాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. నూతనంగా ఎంపికైన రేషన్ షాపు డీలర్లకు గురువారం చండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్డీఓ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన తేదీ వరకు లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేయాలన్నారు. విధిగా రేషన్ షాపుల ఎదుగా స్టాక్ బోర్డు, వినియోదారులకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ సైదులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న ఆర్డీఓ